నిర్వాసితులకు న్యాయమైన నష్టపరిహారం

● చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

రైతులతో మాట్లాడుతున్న చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

రామన్నపేట(వలిగొండ), జూన్18 : త్రిబుల్‌ఆర్ భూ నిర్వాసితులకు ప్రభుత్వం న్యాయమైన నష్టపరిహారం అందజేస్తుందని చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వలిగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రొద్దటూర్ గ్రామ రెవెన్యూ పరిధిలో త్రిబుల్ ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో ఆయన మాట్లాడారు. త్రిబుల్ ఆర్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ నిబంధనల మేరకు మూడింతల నష్టపరిహారం అందజేస్తామన్నారు. నష్టపరిహారం విషయంలో రైతుల అభిప్రాయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించి రైతులకు న్యాయబద్ధమైన పరిహారం అందేలా తన వంతు కృషి చేస్తానని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో సురేందర్‌శర్మ, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డివిజనల్ సర్వేయర్ వెంకటయ్య, ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి, మండల సర్వేయర్ వెంకటేశం, ప్రొద్దటూర్ రెవెన్యూ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల విలువ పెంపు హేతుబద్ధంగా ఉండేలా చర్యలు

చౌటుప్పల్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల రిజిస్ట్రేషన్ల విలువ పెంపు హేతుబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తాసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇబ్బందులు లేకుండా పెరుగుదల ఉండేట్లు చూడాలని ఆదేశించారు. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో మార్కెట్ ధర, రిజిస్ట్రేషన్ ధర ఎంత అనే దానిపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. ఈ నెల 23న వాటిపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలని సూచించారు. హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, లాల్ బహదూర్ శాస్త్రి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

● డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్

సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

బొమ్మలరామారం, జూన్ 18 : యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ అన్నారు. మండలంలోని మర్యాల గ్రామంలో ఆయన ఆధ్వర్యంలో మంగళవారం యువజన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మ్యానిఫెస్టోలో తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను మర్చిపోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వంద రోజులు దాటినా ఇప్పటికీ ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయలేదన్నారు. యవత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అయోమయంలో ఉన్నారని, వారికి నిరుద్యోగ భృతిని చెల్లించాలని, యువత స్వయం ఉపాధి కోసం వడ్డీ లేని సబ్సిడీ రుణాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం, మమత, అఖిల, పప్పి, సరిత కిరణ్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్

బీబీనగర్, జూన్ 18 : మండలంలోని కొండమడుగు అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ హర్ష ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేటీ బచావో బేటీ పడాఓ, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ, గృహ హింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహం, సుకన్య సమృద్ధి యోజనపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్ట్ నిఖిత, మనీషా, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, అమల, రహీమున్నీసాబేగం, మహిళలు పాల్గొన్నారు.

భువనగిరి ఎమ్మెల్యేను అరెస్ట్ చేయాలి

● శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

వినాయక చౌరస్తాలో మాట్లాడుతున్న శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్

భువనగిరి అర్బన్, జూన్ 18 : గోవధను ప్రోత్సహించేలా వ్యవహరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూస శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వినాయక చౌరస్తాలో శివసేన ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టి మాట్లాడారు. గోవధను ప్రోత్సహిస్తూ పోస్టర్ తయారు చేసి మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. ఈ విషయంపై నియోజకవర్గ హిందువులు ఎమ్మెల్యేను క్షమించరని, అతన్ని ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దామోదర్, నవీన్, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో భారీ వర్షం

కట్టంగూర్‌లో కురుస్తున్న వర్షం

కట్టంగూర్, జూన్ 18 : మండల కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్మి భారీ వర్షం కురిసింది. గంటకు పైగా వర్షం కురువడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. భారీ వర్షంతో పాటు గాలి దుమారానికి జాతీయ రహదారిపై కొంత సేపు వాహనాలు నిలిచిపోయాయి. విద్యుత్ పరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం మెట్ట పంటలకు మేలు చేకూరనుంది.

వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం

ఆలయ ముఖ మండపంలో ఏర్పాటు చేసిన అష్టోత్తర శత కలశాలు

యాదగిరిగుట్ట, జూన్ 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంతోపాటు అనుబంధ పాతగుట్ట(పూర్వగిరి)ఆలయంలో మంగళవారం స్వాతి నక్షత్ర పూజలతోపాటు అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో 108 కలశాలను ఏర్పాటు చేసి సప్త నదీ జలాలు, మామిడి, తమలపాకులు, దర్భాలు, పూలమాలలు, కొబ్బరికాయలతో అలంకరించారు. పంచామృతాలతోపాటు సుగంధ ద్రవ్యాలతో స్వామివారిని అభిషేకించారు. 2గంటల పాటు పంచసూక్తాలు, దృశంతులు, పంచ ఉపనిషత్తులు, వేద మంత్రాలు, దివ్యప్రబందంలోని నిరాట్ట మంత్రాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలు చేసి స్వామివారి దర్శించుకున్నారు. సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు కొనసాగాయి. సుమారు 18 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.35,51,093 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.18 లక్షల విరాళం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తులకు నిర్వహించే శాశ్వత నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళాలు సమర్పించారు. అజన్రా హోమ్స్ ప్రతినిధులు నిమ్మగడ్డ రామకృష్ణారావు, జ్యోతి దంపతులు స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం రూ.18 లక్షల చెక్కును ఆలయ ఈఓ భాస్కర్‌రావుకు అందజేశారు.

ధ్వంసమైన కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి పాండు

కాల్వ ధ్వంసమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పాండు తదితరులు

బొమ్మలరామరం, జూన్18 : షామీర్‌పేట వాగు నుంచి మర్యాల గ్రామంలోని ఈదుల చెరువులోకి నీటిని తరలించే కట్టు కాల్వలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి పాండు కోరారు. మంగళవారం చెరువులోకి నీరు వచ్చే కాల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాల్వ ధ్వంసమై సంవత్సరం గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. కాల్వకు మరమ్మతులు చేయకుంటే నీరు రాక చెరువు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే నిధులు కేటాయించి కాల్వ మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. లేకుంటే మత్స్యకారులతో కలిసి ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, గ్రామశాఖ కార్యదర్శి దేశెట్టి సత్యనారాయణ, బండ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

చెన్న లక్ష్మణ్‌కు బెస్ట్ అసిస్టెంట్ గవర్నర్ అవార్డు

అవార్డు అందుకుంటున్న లక్ష్మణ్

భువనగిరి అర్బన్, జూన్ 18 : ఈ నెల 16న భద్రాచలంలో శంకరాభరణం పేరుతో జరిగిన రోటరీ క్లబ్ అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా తెలంగాణ రీజియన్ రోటరీ క్లబ్ మొదటి బెస్ట్ గవర్నర్‌గా భువనగిరికి చెందిన భువనగిరి రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ చెన్న లక్ష్మణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ సేవలను గుర్తించి రోటరీ క్లబ్ రాష్ట్ర గవర్నర్ భూషిరెడ్డి శంకర్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి బెస్ట్ అసిస్టెంట్ గవర్నర్ అవార్డుతోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో రోటరీ క్లబ్ ద్వారా తాను చేసిన సేవలను గుర్తించి అవార్డు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుకు సహకరించిన సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

- భూవివాదం కేసులో ఐదు రోజులుగా స్టేషన్‌కు రప్పిస్తున్నారని మనస్తాపం
- పోలీసుల వేధింపులే కారణమంటూ బాధిత కుటుంబం ఆవేదన
- నిడమనూరు స్టేషన్‌లో ఘటన

నల్లగొండ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న వెంకటాచారి

నిడమనూరు, జూన్ 18 : భూ వివాదం నేపథ్యంలో పోలీసు వేధింపులు తాళలేక మనస్తాపానికి గురైన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి 11 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తన వెంట కవర్‌లో తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాను ఒక్కసారిగా తీసి తాగేశాడు. గమనించిన సిబ్బంది డబ్బాను లాక్కొని స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమం కావడంతో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా దవాఖానకు, అనంతరం నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానకు తరలించి వైద్య సేవ లందిస్తున్నారు.

వివాదం ఇది..

ఎర్రబెల్లి గ్రామానికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి (65) తన భార్య లింగమ్మ పేరున ధర్మాపురం గ్రామ శివారులో ఉన్న ఎ.1.16 గుంటల భూమిని పద్దెనిమిది సంవత్సరాల క్రితం తన కూతురు ధనలక్ష్మి వివాహం కోసం కన్నెకల్‌కు చెందిన తన మేనల్లుడు దేశోజు కనకాచారికి అమ్మకానికి పెట్టి రూ.50 వేలు తీసుకున్నాడు. మిగతా మొత్తం చెల్లించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేయలేదు. గత 18 ఏండ్లుగా ఇరువురి నడుమ వివాదం కొనసాగుతున్నది. సదరు భూమికి వెంకటాచారి భార్య లింగమ్మ పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరవగా ఆమె తన కుమార్తె మేలోజు ధనలక్ష్మి పేరున పట్టా చేశారు. కాగా దేశోజు కనకాచారి సదరు వివాదాస్పద భూమి చుట్టూరా ఇటీవల కంచె ఏర్పాటు చేశాడు. దీంతో వెంకటాచారి ఈయనతో పాటు మేలోజు యాదయ్య, మేలోజు ధనలక్ష్మి, ట్రాక్టర్ డ్రైవర్ మసిముక్కు శ్రీను ఈ నెల 11 న కంచె ను తొలగించి ట్రాక్టర్‌తో భూమిని దున్నారు. 13న కనకాచారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేశారు. ఐదు రోజులుగా స్టేషన్‌కు రప్పిస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు డబ్బాతో వెంకటాచారి నిడమనూరు పోలీస్ స్టేషన్ కు చేరుకున్నాడు. ఎస్ఐ. సమక్షంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. ప్రస్తుతం వెంకటాచారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనపై నిడమనూరు ఎస్ఐ జి.గోపాల్‌రావు వివరణ కోరగా దేశోజు కనకాచారి ఫిర్యాదు మేరకు వెంకటాచారితో పాటు మరో ముగ్గురి పై ఈ నెల 13న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెంకటాచారికి ఆయన సోదరుడు ధనయ్యచారితో ఉన్న మరో భూ వివాదం కారణంగానే ఘటనకు పాల్పడినట్లు వివరించారు. తాము వేధించామన్న ఆరోపణలను ఆయన ఖండించారు. వెంకటాచారిని తాము స్టేషన్‌కు పిలువలేదని ఆయన పురుగుల మందు తాగి స్టేషన్ లోపలికి రాగానే గమనించి దవాఖానకు తరలించామని చెప్పారు.

ఆర్థిక సాయం

రాజాపేట, జూన్ 18 : మండలంలోని దూదివెంకటాపురం గ్రామానికి చెందిన దగ్గుల సాయిలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నక్కిర్త కనకరాజు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షపై సీబీఐ విచారణ జరిపించాలి

మోత్కూరు, జూన్ 18 : నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మందుల సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. నీట్ నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 14న ఫలితాలు విడుదల కావాల్సి ఉండగా, 4వ తేదీన విడుదల చేయడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మార్కండేశ్వర ఆలయ పాలకవర్గం నియామకం ఎప్పుడో!

భూదాన్‌పోచంపల్లి జూన్ 18 : పట్టణ కేంద్రంలోని మార్కండేశ్వర స్వామి ఆలయ నూతన పాలకవర్గం నియామాకం ఎప్పుడు జరుగుతుందోనని చైర్మన్ రేసులో ఉన్న ఆశావహులు ఎదురుచూస్తున్నారు. ఆరు నెలల క్రితం నూతన పాలకవర్గం కోసం సమావేశమయ్యారు. బ్రహ్మోత్సవాల అనంతరం పాలకవర్గం నియమించాలని పెద్దలు తీర్మానించారు. కానీ, ఆరు నెలలుగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పాలకవర్గం నియామకానికి బ్రేక్ పడింది. ప్రస్తుతం అన్ని ఎన్నికలు ముగియడంతో త్వరగా పాలకవర్గాన్ని నియమించాలని కోరుతున్నారు.

హోరాహోరీగా పోచంపల్లి బ్యాంక్ ఎన్నికల ప్రచారం

భూదాన్‌పోచంపల్లి, జూన్ 18 : పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు ఈ నెల 21న జరుగనున్న నేపథ్యంలో అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 9 డైరెక్టర్ల స్థానాలకు గానూ 27 మంది పోటీలో ఉన్నారు. రాజకీయ ఎన్నికలను తలపించేలా ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు కరపత్రాలు పంచడం, సోషల్ మీడియాలో హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. బ్యాంక్ చైర్మన్ రేస్‌లో ఉన్న తడక రమేశ్, కర్నాటి వెంకట బాలసుబ్రహ్మణ్యం తన ప్యానల్ అభ్యర్థులతో కలిసి నువ్వా, నేనా అన్న రీతిలో ప్రచారం సాగిస్తున్నారు. తమకు అవకాశం కల్పిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని అభ్యర్థిస్తున్నారు.

అన్నదానం

భువనగిరి కలెక్టరేట్, జూన్ 18 : అన్నిదానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ చైర్మన్ అతికం లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం పూర్ణగిరి సుదర్శన లక్ష్మీ నరసంహస్వామి ఆలయం వద్ద నిర్వహించిన గిరిప్రదక్షణ అనంతరం సుర్వి శ్రీనివాస్ గౌడ్-ఉపేంద్ర సహకారంతో నిర్వహించిన అన్నదానాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

వంగపల్లి శ్రీనివాస్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు శుభాకాంక్షలు

మోటకొండూర్, జూన్ 18 : తన జన్మదినం సందర్భంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుతోపాటు మాజీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి వంగపల్లికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించి ఎన్నో నిర్బంధాలను ఎదురించి తెలంగాణ ఏర్పాటులో వంగపల్లి క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. వంగపల్లి సేవలు అణగారిన వర్గాలకు ఎంతో అవసరమన్నారు. మలిదశ మాదిగ దండోరా ఉద్యమంతో అహర్నిశలు చేస్తున్న కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేశ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు యాతాకుల భాస్కర్, కోర్ కమిటీ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపర్చాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద

మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద

మోత్కూరు, జూన్ 18 : పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్యపర్చాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ యశోద అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. వానకాలం సీజన్‌లో కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రతి ఇంట్లో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి బొండాలు, పాడైన కూలర్లు, పగిలిన కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్నట్లయితే లార్వాలు అభివృద్ధి చెంది దోమలుగా మారి మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఈ నెల 20న నిర్వహించనున్న నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మనోహర్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ అమరావతి, సీహెచ్ఓ, పీహెచ్ఎన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాస్టర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ విప్‌కు వినతి

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను కలిసిన పాస్టర్లు

ఆలేరు రూరల్, జూన్18 : ఆలేరు నియోజకవర్గంలోని పాస్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మంగళవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విద్య, ఉపాధి, గృహ నిర్మాణం, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించాలని, ఆలేరు కేంద్రంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

డీపీఓ సునందకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

● డీపీఓకు గ్రామపంచాయతీ సిబ్బంది యూనియన్ వినతి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 18 : గ్రామ పంచాయతీల్లో పనిచేసే కారోబార్, బిల్ కలెక్టర్, సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి సునందకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన వెంకటేశ్ మాట్లాడుతూ.. గత 5 నెలల నుంచి పెండింగ్ వేతనాలతో పాటు సమ్మె కాలం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ 51ని రద్దు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి లింగస్వామి, ఉపాధ్యక్షుడు బాలచందర్, కట్కూరి స్వామి, దేవుళ్ల స్వామి, పి.స్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న హోమం

చౌటుప్పల్, జూన్ 18 : పట్టణ కేంద్రంలోని సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి ఆలయ 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణం, సర్వదేవత మండపారాధన, గణపతి, సుబ్రహ్మణ్యం, అయప్ప, సత్యనారాయణ స్వామి, పరమేశ్వరి, కాశీ విశ్వేశ్వర మూలమూర్తులకు పంచామృత అభిషేకాలు, హోమం, అన్నదానం, వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆలయ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, బత్తుల శ్రీశైలం, బొబ్బిళ్ల మురళి, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, పోలోజు శ్రీధర్‌బాబు, బొడిగె బాలకృష్ణగౌడ్, తాడూరి పరమేశ్, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, ఊడుగు రమేశ్‌గౌడ్, అంతటి రాము గౌడ్ పాల్గొన్నారు.